


# పరదేశీ కథలు
## - చిట్టే సిద్ధ లలిత



– 131 –

# ఎడారి వీరుడు-వెన్నెల సుందరి

**అర్థరాత్రి, చిమ్మచీకటి...**

ఎడారి వాతావరణం భయంకరంగా వుంది. పరిసరాలు నిద్రలో జోగుతున్నాయి. జరజరా ప్రాకే ఎడారి పాముల సరసరమనే అలికిడికి ఒంటిపై జలదరింపు కలుగుతోంది.

ఎడారి జంతువుల అరుపులు వింతగా, కొత్తగా, భయంకరంగా వినపడుతున్నాయి. ఇంకొకరైతే అడుగు ముందుకుపడక గుండె ఆగి అక్కడే మరణించేవాళ్ళు.

కానీ అతడి స్థిరనిశ్చయత ముందు ఎడారి తలవంచింది. మొక్కవోని అతడి పట్టుదలను చూసి భయంకరమైన వాతావరణం సైతం ఆశ్చర్యపోయింది. ఒక్క రోజు కాదు, ప్రతిరోజూ అర్థరాత్రి అతడికి అదే పని. అప్పగించిన పనిని పూర్తిచేయాలనేది అతడి తపన.

ఒక్కడే కువైట్ పట్టణానికి దూరంగా వున్న ఎడారి మధ్యలోకి కారులో వచ్చి అంతంలేని ఎడారి దిబ్బలను దీక్షగా తవ్వుతున్నాడు. ప్రాణాలకు తెగించిన అతడి సంకల్పం గొప్పది. అందుకే అతడికి ప్రకృతి సహకరిస్తోంది.

ఎడారి దిబ్బలు స్థిరత్వం లేనివి. గాలి వీస్తే చాలు ఎగిరివెళ్ళిపోయి మరోచోట దిబ్బలుగా గుట్టలుగా పేరుకుంటాయి.

ఈరోజు చూసిన స్థితి, రూపం మరోరోజు వుండదు. ఎడారికి రంగు, రూపం తప్ప ఆకారం వుండదు.

ఎటు చూసినా దిగంతాలవరకూ ఇసుక, గాలికి ఎగిరే ధూళి తప్ప కంటికి ఏదీ కనిపించదు.

కొండల్లో, అడవులలో, మైదానాలలో ప్రయాణం సులువైనది, కానీ ఎడారి ప్రయాణం ఎంతో సాహసంతో కూడుకున్నది. ప్రాణాలకు తెగించి చేసేది.

దారి మరిచిపోయినా, దిశమారినా ప్రమాదం ఎదురయినా ఎడారిలో చిక్కుకుని ప్రాణాలు వదలాల్సిందే..! దాహంతో గొంతెండి చావాల్సిందే..!

పగలు ఎండ వేడిమి, రాత్రి చలి తాకిడి చాలా ఘోరమైనవి. మానవమాత్రులకు అభేద్యమైనది ఎడారి. ఏదో ఒక గుడ్డిగుర్తుతో అతడు ఆ ఎడారిని తవ్విపోస్తున్నాడు.

ఎడారిలో పాతిన నిధిని వెతకడం సముద్రంలో నీటిని తోడి బయటపొయ్యడం ఒకటే... అయినా అతడు విశ్రమించలేదు. అలసిపోలేదు. చాలని విరమించలేదు. ఎంతో కఠినంగా శ్రమిస్తున్నాడు. బలిష్ఠమైన చేతులతో గునపాన్ని ఎడారి గుండెలోతుల్లోకి దింపుతున్నాడు.

ఏదో ఒకరోజు ఖంగుమంటుందేమో అనే ఆశ అతడిని ఆ పనికి ప్రేరేపిస్తోంది. వెనుతిరగని పోరాట పటిమ అతడికి కొత్త శక్తిని ఇస్తోంది. అంత చలిలోనూ అతడి దేహంపైనుండి స్వేదం ఇసుకలోకి జారుతోంది.

విషసర్పాలు, తేళ్ళు, జెర్రెలు చుట్టూ తిరుగుతూనే వున్నాయి. గునపం శబ్దానికి రాబందులు నిద్రలేచి రెక్కలల్లార్చి

ఆహారం దొరుకుతుందేమోనని చూస్తున్నాయి. వీలయితే అతడిని ప్రాణంతోనే ముక్కులతో పొడిచి చంపి దేహాన్ని తినాలనుకుంటున్నాయి. మరోవైపు ఎడారి నక్కలు కూడా చుట్టూ వున్న పొదలమాటున కాపు కాస్తున్నాయి.

అతడి చేతిలో గునపం లేకపోతే వెంటనే వచ్చి మీదపడి చీల్చి చెండాడుతాయవి. అంతేకాదు అతడి జేబులో పిస్టల్ కూడా వుంది. దాని నిండా బులెట్స్ వున్నాయి.

అతడు పని మొదలు పెట్టిన రెండోరోజే శబ్దం చెయ్యడం అతడికి ఇష్టం లేకపోయినా మీదకు దూకే ఒక నక్కను తుపాకీతో కాల్చి చంపాడు.

"ఢామ్మనే" శబ్దం ఎడారిలో మారుమ్రోగింది. దిక్కులు పిక్కటిల్లిన ఆ శబ్దంతో నక్కలు భయపడి తోకలు జాడించి పరిగెత్తాయి.

అప్పటినుండీ అవకాశంకోసం ఎదురుచూస్తూ అతడినే గమనిస్తూ పొదలమాటున దాగివుంటున్నాయి.

ఆ రాత్రి గాలిరేగుతోంది. పెద్ద ఎత్తున ఇసుక తెరలుతెరలుగా పైకెగిరి దుమారం సృష్టిస్తోంది. దాన్ని ఇసుక తుఫాను అంటారు.

చుట్టూ గాలిలో దుమ్ము పేరుకుపోవడంతో కంటికేమీ కనిపించడంలేదు. అయినా అతడు బెదరలేదు. ఒక్క నిముషం కూడా విశ్రాంతి తీసుకోలేదు. పార్క్ చేసిన కారు లైట్ల వెలుగులో తీవ్రంగా శ్రమిస్తున్నాడు.

ఇంతలో ఏదో వాహనం అటు వస్తున్న శబ్దం వినిపించింది.

వెంటనే కారు లైట్లను ఆపు చేసి చీకట్లో నిలబడి ముందుకు చూసాడు. కాస్త వెన్నెల కురుస్తుండటంతో పరిసరాలు మసకగా కనబడుతున్నాయి.

ఒక కారు వచ్చి అతడికి మరోవైపు వున్న ఇసుకదిబ్బల వద్ద ఏదో మూటను పడేసి వెళ్ళిపోయింది.

కారు వెళ్ళిపోయిందని నిర్ధారించుకుని అది ఏంటో అనుకుంటూ మెల్లగా అక్కడికి చేరుకున్నాడతను.

ఒక పెద్ద నల్లటి బ్యాగు అక్కడ పడివుంది. ఒక్క క్షణం సందేహిస్తూ చూసి ఏదైతే అదయ్యింది అనుకుంటూ బ్యాగును తెరిచాడు. లోపల కాళ్ళూ చేతులూ కట్టేసిన ఒక ఆకారం వుంది. కట్లు విప్పి నోటికున్న టేపును తీసాడతడు.

"హమ్మయ్య... బతికానన్నమాట" అంది ఆ ఆకారం నీరసంగా.

కోయిల కూసినట్లుంది కంఠం. ఆ ఆకారం స్త్రీ అని అర్థమయింది.

"దాహంగా వుంది, నీళ్ళున్నాయా" అడిగిందామె.

కారులోని నీళ్ళ బాటిల్ తీసుకొచ్చి ఇచ్చాడు. తాగి ఊపిరి గట్టిగా తీసుకుంది.

వెన్నెల్లో బొమ్మలా వుంది ఆమె.

ఆమె నోటివెంట తెలుగు వినడంతో ఆశ్చర్యపోయాడతడు.

"ఎవరు నువ్వు? ఎందుకు నిన్ను ఎడారిలో పడేసిపోయారు" ప్రశ్నించాడు.

"నేను కువైట్ షేకు ఇంట్లో పనిమనిషిగా వున్నాను. సేటు కొడుకు కామాంధుడు. వాడు వాడి స్నేహితులు అత్యాచారం చేసి నన్ను పాడుచేసాడు. నేను ప్రతిఘటించడంతో బాగా కొట్టారు. నేను స్పృహ కోల్పోవడంతో చనిపోయాననుకుని మూటకట్టి ఈ ఎడారిలో పడేసి పోయారు" అని దు:ఖించిందామె.

"సరే బాధపడకు, బతికి బయటపడ్డావు కదా" ఓదార్చాడు.

"ఏ వూరు మీది? ఎందుకు ఈ అర్థరాత్రి ఈ ఎడారిలో వున్నావు? ఎడారి భూతానివి కాదుకదా?" భయపడుతూ ప్రశ్నించిందామె.

"నేనో పనిమీద ఎడారిలో తిరుగుతున్నాను. ఆస్తి కోసం మా సేటును అతడి తమ్ముడు చంపబోతే మా సేటు వజ్రాలు, వైఢూర్యాలు, బంగారమంతా ఒక భోషాణంలో పెట్టి తాళం వేసి తెచ్చి ఈ ఎడారిలో పాతి పెట్టాడు తరువాత ఇల్లొదిలి పారిపోయి నాలుగేళ్ళుగా సౌదీలో తలదాచుకున్నాడు."

తమ్ముడితో బాధలు పడలేక ఎక్కడ చంపేస్తాడోనని భయపడి పక్కదేశానికి పారిపోయాడు..

"నేను పదేళ్ళుగా డ్రైవర్ గా పని చేస్తున్నాను. ఆ నిధిని కనిపెట్టి తవ్వి తీయమని నన్ను అర్థించాడు. అది ఇక్కడే పొదల దగ్గరే ఎక్కడో వుంటుంది" అన్నాడు అతడు.

"నా పేరు అలిమేలు. తిరుపతి దగ్గర వుండే చంద్రగిరి మా ఊరు. నువ్వెక్కడి వాడివి ఏ ఊరినుండి వచ్చావు ఇక్కడికి? అని ప్రశ్నించింది. మీ పేరు ఊరు చెప్పండి" అడిగింది.

"నా పేరు శ్రీను. మాది కాళహస్తి" చెప్పాడతడు.

"ఒక జిల్లా వాళ్ళమే" అంటూ సంబరపడింది. ఆమె అలా ఆ ఎడారిలో అర్ధరాత్రి కలవడం అనేది యాధృచ్ఛికమో, విధిలిఖితమో తెలియదు కానీ ఆమె వలన అతడి జీవితం ఒక గొప్ప మలుపు తిరగబోతోందని ఆ క్షణం అతడు ఊహించలేదు. ఆ సమయంలో భయంకరమైన ఆ ఎడారిలో కురిసే వెన్నెల్లో ఆమె ఒక బొమ్మలా వుంది. ఇంతలో తెల్లటి ఎడారి సర్పం ఒక కప్పను వెంబడిస్తూ పక్కనుండి పాక్కుంటూ వెళ్ళింది. భయపడిన అలిమేలు అతడి దగ్గరికి జరిగి హత్తుకుంది.

భయపడకు అన్నట్లుగా దగ్గరికి తీసుకున్నాడు శ్రీను. స్త్రీ స్పర్శ కొత్తగా వుంది అతడికి.

ఎటు చూసినా ఎడారి. ఆకాశం కింద ఆ ఎడారిలో అతడికి ఆ స్పర్శ ఒక ఓదార్పులా అద్భుతంలా అనిపించింది.

అంతకుముందు ఇద్దరూ ఎవరో ఒకరికి ఒకరికి తెలియదు, అయినా భయంకరమైన ఆ ఎడారి, ఏకాంతం భయానకమైన వాతావరణం వారిని దగ్గరచేసింది.

ఒకరి స్పర్శను ఒకరు ఆస్వాదిస్తూ అలా ఎంతసేపు వున్నారో తెలియలేదు. తరువాత ఆమె కౌగిలిలోనుండి విడివడి కింద ఇసుకలో కూర్చుంది. అతడు కూడా పక్కనే కూర్చున్నాడు.

చాలాసేపు ఒకరికొకరు కష్టసుఖాలు, అనుభవాలు తలపోసుకున్నారు. మాటల్లో ఆమె ఒక వితంతువనీ పిల్లలు లేరనీ భర్త చనిపోయాక అత్తమామల వేధింపులు ఎక్కువవగా అమ్మ వాళ్ళింట్లో వుండి తల్లిదండ్రులకు భారం కాకూడదని చెల్లెళ్ళ చదువులకూ, పెళ్ళిళ్ళకు తన వంతు సహాయం చెయ్యవచ్చని భావించి కువైట్ కు వచ్చింది.

కానీ తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది. ఏజెంట్ కాముకులు వున్న ఇంట్లో ఆమెకు పని చూపించాడు. దాదాపూ ఒక సంవత్సరం నుండీ వారి వేధింపులను ఆమె భరిస్తూ వస్తోంది. ప్రతిఘటిస్తోంది. కానీ నిన్న దురదృష్టవశాత్తూ వాళ్ళ చేతుల్లో చిక్కింది. ఆఖరికి దేవుని దయవలన ప్రాణాలు దక్కాయి. తన జీవితాన్ని కష్టాలను చెప్తూ దు:ఖించిందామె

అంతసేపూ ఇసుకలో పిచ్చి గీతలు గీస్తున్న ఆమె వున్నట్టుండి ఎడమచేతి వైపు చూపిస్తూ ఇక్కడేదో గట్టిగా డబ్బాలా చేతికి తగులుతోంది చూడు అంది.

చూస్తే సరిగ్గా సేటు పాతిపెట్టిన భోషాణం పెట్టె పైనే ఆమె కూర్చుని వుంది. అదృష్టం ఆమె రూపంలో ఎదురొచ్చినట్లయింది.

ఇన్నాళ్ళ తన శ్రమ ఫలించి వెతుకుతున్న నిధి దొరికినందుకు సంతోషించాడు శ్రీను.

వెంటనే ఇద్దరూ పెట్టెను పైకి లాగి కారులో పెట్టేసారు.

అంతటితో కథ సుఖాంతం కాలేదు.

కారును కదిలించి ముందుకు వెళుతుంటే ఎక్కడినుండి వచ్చారో అలిమేలును విసిరేసిన వాళ్ళు సడన్ గా వచ్చి కారును ఆపాలని ప్రయత్నించారు.

"వద్దు శ్రీనూ... కారును ఆపకు. ఆ దుర్మార్గులు మనల్ని చంపేస్తారు" అని అరిచింది అలిమేలు. కారు స్పీడును పెంచి ముందుకు దూసుకుపోయాడు శ్రీను.

వాళ్ళు కూడా విడవకుండా కారుతో వెంబడించారు. సౌది అరేబియా సరిహద్దులవరకూ ఛేజ్ చేసారు.

తరువాత శ్రీను వారికంటికి కనబడకుండా తప్పించుకుని మరోవైపునుండి దూసుకుపోయాడు. జరిగిందంతా చెప్పి తమ సేటుకు భోషాణాన్ని అప్పగించగానే సేటు ఆనందబాష్పాలు రాల్చాడు.

"ఇది మా వారసత్వ సంపద. ఇక మరలా పొందలేనని భయపడ్డాను. నువ్వు నేను పోగొట్టుకున్న నిధిని సాధించిన ఎడారి వీరుడివి" అని అభినందిస్తూ అందులోని వజ్రాలు కొన్ని, బంగారం కొంత కానుకగా ఇచ్చాడు.

కువైట్ లో వున్న దుర్మార్గుడైన తమ్ముడికి భయపడి సౌదీ అరేబియాలోనే స్థిరనివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడు సేటు.

వారసత్వ సంపదైన నిధి దక్కినందుకు సంతోషించి శ్రీనును గుండెలకు హత్తుకున్నాడు

"ఇండియాకు వెళ్ళి ఇద్దరూ వివాహం చేసుకుని సుఖంగా జీవించండి" అని చెప్పాడు.

నిధితో పాటూ జీవితానికి తోడుగా మంచి అమ్మాయి కూడా దొరికినందుకు సంతోషించాడు శ్రీను.

(మరోకథ వచ్చేనెల)

Post your comments